

రాత్రి పదిగంటలవేళ వర్షం జోరుగా కురుస్తోంది. గాలి జోరు ఎక్కువగా వుంది. మధ్య మధ్య మెరుపులు కత్తుల్లా మెరుస్తున్నాయి. చీకటి భయంలా దట్టంగా వుంది.

రంగనాయకులు వర్షంలో తడుస్తూ ఒంటరిగా నడుస్తున్నాడు. కుండలతో పట్టి పోస్తున్నట్టుగా వుంది వర్షం. రంగనాయకులు తీవ్రమైన ఆలోచనల్లో ఆశ్రయాన్ని కోల్పోయిన పక్షిలా తల్లడిల్లి పోతున్నాడు.

అతని మనసులో వున్నది పద్మ. పద్మ గురించే ఆలోచనలు...

అతను ఆరోజే హైదరాబాదు నుండి బందరొచ్చేడు. ఊళ్లో అడుగు పెడుతుండగానే అతను విన్న మొదటి విషయం పద్మ పెళ్ళినిగురించి. ఆ మాటలు విన్నక్షణంలో అతనిగుండె ఆగిపోయిన మాట నిజం.

పద్మ అతని స్నేహితుడు జగన్నాథం చెల్లెలు. బి. ఏ. పాసయింది. పద్మపైన అతనికి బోలెడభిమానం. అంతకంటే అతనిగుండెలో ఆమెపైన వెచ్చని ప్రేమ వున్నది.

పద్మపైన ఆకాశమంత ఆశని పెట్టుకొన్నాడు. ఆ ఆశతోనే కలలు కంటూ కలల్లో మేడలు కట్టాడు. ఆ మేడలు చిన్నగాలి మాత్రానికి కూలిపోతాయని అతనుకోలేదు.

ఉరుము భయంకరంగా వురిమింది. రంగనాయకులు వులిక్కిపడ్డాడు. చెట్లు గాలిధాటికి తట్టుకోలేక అటూ ఇటూ వూగిపోతున్నాయి. అతను నడుస్తూనే వున్నాడు. ఆకాశంలోంచి నీళ్లధారలు... అతనిఒంటికి బట్టలు అతుక్కుపోయాయి. తలనుంచి నీరు జారుతున్నది.

మెరుపు కత్తిలా మెరిసింది. కళ్ళు జిగేల్మన్నాయి. ఆ వెలుగులో అతని కళ్ళముందు ఓ దేవత కదిలాడింది. ఆ దేవత పద్మ. ఆ రోడ్డుమీద భయం చీకటితో కలిసి కుంభవృష్టిలో విలయ తాండవం చేస్తోంది. అతని గుండెల్లో దిగులు రాజ్యం చేస్తోంది.

అప్పుడు రాత్రి పదకొండు కాలేదు. విశ్వనాథం ఇంటిని సమీపించేడు. విశ్వనాథం రంగనాయకులికి మంచి స్నేహితుడు. అదీకాక విశ్వనాథానికి పద్మ బాబాయి కూతురవుతుంది.

తలుపు తట్టాడు. కొన్ని చిల్లర నిమిషాలతర్వాత విశ్వనాథం తలుపు తెరచి రంగనాయకుల్ని చూసి అమితంగా ఆశ్చర్యపోయాడు.

'ముందు లోపలికి రా. బట్టలు మార్చుకొందూగాని,' అన్నాడు.

రంగనాయకులు మాట్లాడకుండా లోపలికివెళ్ళాడు. తువాలుతో తల తుడుచుకొని విశ్వనాథం ఇచ్చిన లుంగీపంచెని కట్టుకున్నాడు.

'ఇప్పుడు చెప్పు ఇంత రాత్రివేళ వర్షంలో......!'

'ముందో సిగరెట్ ఇలా పడేయి' విశ్వం మాటల్ని మధ్యలోనే తుంచి అడిగాడు.

సిగరెట్టు వెలిగించిన రంగనాయకులు మెల్లగా అన్నాడు.

'నీకు శ్రమ ఇచ్చాననుకొంటాను.'

'నాలిక తెగ్గోస్తాను. ఏమిటా వాగుడు.'

పేలవంగా నవ్వేడు రంగనాయకులు.

విశ్వనాథం అన్నాడప్పుడు.

'రే రంగా! నీకో నేను గనక సరిపోయిందిగానీ అదే మరొకడైతే ఎప్పుడో పిచ్చపట్టి పారిపోయివుండును......'

రంగనాయకులు మరో సిగరెట్టు వెలిగించి అన్నాడు.

'నేనీరాత్రికి ఇక్కడే వుండిపోతాను.'

'ఓరి ఫూల్! లేకపోతే ఈ వర్షంలో మళ్ళీ వెళ్తాననా!'

విశ్వం ఆ గదిలో అతనికోసం మడత మంచం, పరుపూ వేశాడు. రంగనాయకులికి ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు.

'పద్మ పెళ్ళటకదూ?' అడిగాడు.

"అవున్రా! ఈ నెలాఖరులో" అన్నాడు విశ్వం పక్క సర్దుతూ.

(రేయ్ విశ్వం! పద్మ పెళ్ళయిపోతే పోతే నేనేమయిపోవాలను కొంటున్నావ్? వద్దురా బాబూ వద్దు మీచెల్లెలికి పెళ్ళి చేయకండి. పద్మని నేను ప్రేమించాను. పుల్లోలేనంతమాత్రాన నాకు తెలీకుండా పెళ్ళిచేసేయాలనుకొన్నారా? నయం! ఈ పెళ్ళే గనక జరిగివుంటే ఈ రంగనాయకులు గుండె ఆగి చచ్చేవాడు. విశ్వం! నా ప్రాణాలు నీ చేతుల్లో వున్నాయి. నన్ను రక్షించరా బడవా! నా ప్రేమని బ్రతికించు. పద్మ లేకపోతే నేను బ్రతకలేను. ఐ లవ్ హర్ డియర్లీ. నువ్వే నన్నో వడ్డుకి చేర్చాలి!)

'థాంక్స్! ఆ సిగరెట్టుపెట్టె నాకిచ్చి నువ్వెళ్ళిపో' అన్నాడు మనసులో అనుకున్నది చెప్పలేక.

'సరే నీ యిష్టం. ఉదయం కాఫీ తాగేక మాట్లాడుకుందాం!' అంటూ విశ్వం వెళ్ళిపోయాడు.

తలుపు గడియపెట్టాడు రంగనాయకులు. అతను కాలుస్తోన్న సిగరెట్టు పొగ చెదిరిపోతోంది,

పద్మ ఎదురుగా నించున్నట్టుగా అనిపించిందతనికి. అతని కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. తనొక సామాన్యమైన మనిషి. వెనక లక్షలు లేవు. మేడలు లేవు. కారులూ లేవు. కానీ వీటన్నిటినీ మించి అతనికి అందమైన హృదయం వుంది.

పద్మని ఎవరో బిగ్‌షాట్ కిస్తున్నారు. అతనితో పోల్చుకుంటే తను ఆఫ్టాల్ బిచ్చగాడే అవుతాడు. తను లా చదువుతున్నాడు. బోర్డు కట్టేక కనీసం రెండేళ్ళన్నా చేతులు నలుపుకుంటూ కోర్టులో ఏదో చెట్టుకింద కాపురం చేయాల! అయినా ఈ రోజుల్లో ప్లీడర్లకీ, ఇంజనీర్లకీ పిల్లల్నిచ్చే దెవరు?!

చాలాకాలంగా తను జగన్నాథం ఇంటికి వెళ్తున్నాడు. పద్మ తనతో మాట్లాడేది. చాలా విషయాలు మాట్లాడేది. పద్మ సాక్షాత్తు ఓ దేవతలా వుంటుంది.

పద్మంటే తనకి బోలెడు ఇష్టం. కాదు ప్రేమ. కిటికీ దగ్గరగా వెళ్ళి నించున్నాడు రంగనాయకులు.

చీకటి చిక్కగా వుంది. వర్షం...విపరీతంగా కురుస్తోంది. వర్షం చూస్తుంటే భయం, చీకటిని చూస్తుంటే తన జీవితం గుర్తుకొచ్చి తల్లడిల్లిపోయేడు రంగనాయకులు. చలిగాలి రివ్వున వీస్తోంది.

గదిలో గోడవారగా ఓ సాలెపురుగు పైకి పాకాలని ప్రయత్నం చేస్తోంది. విపరీతమైన గాలివల్ల దాని ప్రయత్నం ప్రతిసారీ విఫలమౌతోంది. అంతమాత్రం చేత అది తన ప్రయత్నాన్ని మాత్రం మానుకోలేదు. పట్టుదలని వ్యక్తంచేస్తూ కర్తవ్యంపట్ల మనిషికో సందేశాన్ని ఇస్తోందది.

మెరుపు జిగేలుమని మెరిసింది.

(నువ్వా నన్నర్థం చేసుకోలేదురా విశ్వం! నీ చెల్లెల్ని ప్రేమించానని చెబితే నన్నో వెధవగా జమ కట్టేస్తావన్న భయంతో ఇంతకాలమూ నీకు చెప్పలేదు. నేను నీ ప్రాణంలాటి వాడినని బోలెడు సార్లు నువ్వన్నావు. అలాటిది నా మనసుని నువ్వు చదవలేదే అని బాధ పడుతున్నాను. ఇంతకాలంగా జగన్నాథం గారింటికి వెళ్తున్నాను. వాడవా నన్ను గమనించలేదు. మీరంతా వెర్రి మనుషులు. మనుషుల్ని గమనించే చూపుగానీ, చదివే తెలివి నీ మీకు లేదు. ఇప్పుడు సమయం మించిపోయింది. ఈ వెధవ మనసులో వుంది చెబితే అభాసు కావల్సిందే కానీ బొత్తిగా ప్రయోజనం లేదని నాకు తెలుసు. జరిగిపోయే పద్మ పెళ్ళి గుర్తుకొస్తే గుండె పగిలిపోతోంది నాకు.

వో మై డియర్ పద్మా! స్వీట్‌గర్ల్! మే ది హెవెన్ షవర్ ఇట్స్ చాయిసెస్ట్ బ్లెస్సింగ్స్ ఆన్‌యూ.

రంగనాయకులికి బోరుమని ఏడవాలనిపించింది. కిటికీ దగ్గరే నించుని సిగరెట్టు వెలిగించేడు రంగనాయకులు.

* * *

కిటికీలోనుండి జల్లుపడుతున్నా అక్కడే నించుని బయటకు చూస్తున్నాడు లాయర్ రంగనాయకులు. అయిదేళ్ళ క్రితం సరిగా ఇలాటి వర్షం రాత్రి పద్మ గురించి ఆలోచిస్తూ విశ్వనాథం ఇంటిలో గడిపినవిషయం గుర్తుకొచ్చింది.

వల్లాటి ఆకారాలతో చెట్లు భయాన్ని

# ఇది విషాదం

కలిగిస్తున్నాయి? మెరుపులు కత్తుల్లా తళ తళ మని మెరుస్తున్నాయి. గాలికి గదిలో కేలండర్లు ఎగిరి పడుతున్నాయి టేబిల్ మీద వున్న పుస్తకం పేజీలు రెప రెప లాడేయి. వో ఫోటో ఎగిరి క్రింద పడింది.

రంగనాయకులు ప్రేమగా ఆ ఫోటోని చేతుల్లోకి తీసుకున్నాడు.

'పద్మ!' అతని కళ్లనుండి నీరు జారుతోంది. మెల్లగా గోడవారగా వున్న బీరువా తెరిచి అందులోంచి అందంగా వున్న పచ్చరంగు సీసాని తీశాడు. దాని మీద వాట్ 69 అని రాసి వున్నది. ఆ అక్షరాలు ఇంగ్లీషులో చాలా ముచ్చటగా వున్నాయి.

సీసా మూతతీసి అందులో వున్న ఔషధాన్ని గ్లాసులోకి వంపుకొని రెండు పొర్లుగా గొంతులో పోశాడు. చేత్తో కంఠాన్ని సవరించుకొన్నాడు. సగం సీసా ఖాళీఅయింది. అప్పుడతని దృష్టి గోడకి వేలాడుతోన్న వో ఫోటో మీద పడింది. అది రంగనాయకులు తన పెళ్లికి తీయించుకున్నది. ఆ ఫోటోలో తనప్రక్క రాధ వున్నది.

'రాధ!' అస్పష్టంగా అనుకొన్నాడు.

చలిగాలి రివ్వున వీస్తోంది. అతను బరువుగా కళ్ళు మూసుకున్నాడు.

'అయాం సారీ రాధా! ఆ రోజు పద్మముందు కావాలనిమాత్రం నేను కొట్టలేదు. నీ మనసుని చంపుకొని తిరిగి నా దగ్గరకి రావని మాత్రం తెలుసు.'

రంగనాయకులు దిగులుగా చూశాడు ఫోటోవంక.

* * *

—జగన్నాథం వుత్తరం రాసేడు రంగనాయకులికి. వాళ్ల బావగారు పనిమీద కలకత్తా వెళ్లేరనీ పద్మని అంచేత వంటరిగా హైదరాబాదు పంపుతున్నట్టూ పద్మ ఎగ్జిబిషన్ చూడాలని ముచ్చట పడుతున్నట్టూను.

పద్మ వస్తోందంటే రంగనాయకులు చాలా ఆనందపడ్డాడు. మరంతలోనే చాలా బాధపడ్డాడు రంగనాయకులు. దేవుడు తన జాతకాన్నలా రాసేడుగానీ లేకపోతే పద్మని తను దక్కించుకునేవాడు. అప్పుడా జీవితం మరోలా వుండేది. ఇలా వుండేది కాదు.

రాధకి చెప్పేడు పద్మగురించి. రాధ విన్నది. సిగరెట్టు వెలిగించి శూన్యంలోకి చూస్తూ,

'పద్మ చాలా అందంగా వుంటుంది' చెప్పేడు.

రాధ మాట్లాడలేదు. మాట్లాడదనీ తెలుసు.

రంగనాయకులికి పద్మ అందం గురించి రాధకి చెప్పాలని పించింది.

—స్టేషనుకెళ్లి పద్మని కారెక్కించుకొని వచ్చాడు. పద్మని రాధకి పరిచయం చేశాడు.

అతనూ, పద్మా మాట్లాడుతుంటే రాధ కాఫీ తీసుకొచ్చింది.

పద్మ స్నానంచేసి బట్టలు మార్చుకొని ఓ బొమ్మలా తయారైంది. అతనామెని చూసి కలవరపడ్డాడు.

(నీవంక చూడ్డానికి నాకు భయం వేస్తోంది. అలోచన్లలో వెధవనై పోతున్నాను. నిన్ను దక్కించుకోలేని నా పిరికితనానికి ప్రతిక్షణం ఏడుస్తున్నాను. దేవుడా! నన్ను రక్షించు. పద్మ ముందు నన్నీ స్థితినుండి మాత్రం దిగజారకుండా కాపాడు. నన్నుగురించిగానీ, నా బాధగురించిగానీ ఆలోచించేవారు. జాలిపడేవారు కూడా లేరు. కనక నామీద నేనే జాలి పడుతున్నాను. ఐ పిటీ మై సెల్ఫ్)

'తప్పు! అలా చూడకూడదు' అన్నట్టుగా ఆమె మెళ్లో సూత్రాలు తళుక్కున మెరిసినాయి.

'ఏమిటలా చూస్తున్నారు?' మెత్తగా నవ్వుతో వచ్చి కూర్చుంది పద్మ.

'అఁ అబ్బే ఏం లేదు'

'మీరు బొత్తిగా మారలేదు' అంటూ అనవసరంగా నవ్వింది పద్మ!

(నేను మారని మాట నిజమే! మారను కూడా. నీకు తెలీదు కానీ పద్మా నిన్నమితంగా ప్రేమించిన రాస్కెల్ని. నువ్వంత ఫ్రీగా, అమాయకంగా మాటాడుతుంటే నేను గిల్టీ ఫీలవుతున్నానా)

అతను లేచి నుంచుని బయటకు నడిచాడు.


పద్మ కార్లో అతని వక్కనే కూర్చుంది. అతనేమీ మాట్లాడకుండా డ్రైవ్ చేస్తున్నాడు. పద్మ వాళ్ల ఆయన గురించి వసపోసినట్టుగా మాట్లాడేస్తోంది. కారు ఎగ్జిబిషను గ్రౌండుదగ్గర ఆగింది.

పద్మ కారు దిగుతూ అన్నది.

'రాధగార్నికూడా తీసుకొస్తే బావుండేది!'

అతను నవ్వి వూరుకొన్నాడు.

ఎగ్జిబిషన్లో షాల్, గాజులు, చీరలు, పూసలదండలు ఏవేవో కొన్నది. అన్నిం



టికి రంగనాయకులే పే'చేశాడు.

'ఇలా అవుతే ఇక్కడ వస్తువులన్నీ కొనేయాలను' నవ్వుతూ అన్నది. అతనూ నవ్వేడు.

స్టాల్‌దగ్గర టీ తాగి రెండు రౌండ్లు తిరిగారు. ఆ సమయంలో అతని మనసు మనసులో లేదు.

పదిన్నరగంటలవేళ ఇంటికి చేరారు. భోజనాలతర్వాతకూడా పద్మ ఏవో చెబుతూనే వుంది. సిగరెట్టు వెలిగించి ఆమె కెదురుగా ఈజీచెయిర్లో కూర్చొన్నాడు. రాధ తన గదిలోకి వెళ్లిపోయింది.

'నాకూ నిద్ర వస్తోంది. గుడ్‌నైట్!' అన్నది.

* * *

రంగనాయకులికి నిద్ర పట్టలేదు. సిగరెట్లు కలుస్తూ గదిలో పచార్లు చేస్తున్నాడు.

బయట వెన్నెల అందంగా పరుచుకుని వున్నది. చలిగాలి వేస్తోంది. పద్మ పడుకొన్న గదిలోకి తొంగిచూశాడు రంగనాయకులు. బెడ్‌లైట్ వెలుగులో పద్మ కనబడింది. గదిలో మూలగావున్న స్ప్రింగ్ కాట్‌మీద పద్మ వెల్లకితలా పడుకొని వుంది. పవిట పక్కకు జారిపోయి ఎత్తైన పద్మ గుండెలు అతన్ని పిచ్చివాడిని చేశాయి. చీర మోకాళ్ల పైకి చెదిరి వుంది.

దగ్గరకు వెళ్లి పద్మను చూడాలని పించింది.

అతని మనసు పిచ్చి ఆలోచనలతో కొట్టుకొంటూ వుంది. మెల్లగా ఆమె పడుకొన్నగదిలోకి వెళ్లాడు.

అమాయకంగా నిద్ర పోతోన్న పద్మను ఆ సమయంలో చూస్తుంటే ఏడుపొచ్చిందతనికి.


(మనుష్యుర్ని తినే అందం నీది. నన్నిలా కూడా బ్రతకనిచ్చేట్టు లేవు. లాభం లేదు నాలో ఏదో దెయ్యం ప్రవేశించింది. పద్మా నువ్వు నాక్కావాలి)

మెల్లగా ఆమె మొహం పైకి వంగేడు. పద్మ నిద్రలో మగతగా కదిలింది. రంగనాయకులు వులిక్కిపడ్డాడు.

(దేవుడా నన్ను రక్షించేవు. అయినా నీకు నేనేం అపకారం చేశానని నన్నిలా పశువుని చేయాలను కొన్నావు నయం! ఈ దేవతనా రాక్షసత్వానికి బలైపోయింది కాదు. ఈ దౌర్భాగ్యుడ్ని క్షమించు.)

అతను గదిలోకి వెళ్లిపోయాడు. అతనికళ్లు నీళ్లు నిండుకొన్నాయి.

* * *




—'ఏయ్ ఏమిటా మొద్దునిద్ర లే!' అంటూ రాధని తట్టి లేపేడు రంగనాయకులు. రాధ బద్ధకంగా కదిలింది.

'మీరుకూడా రావల్సింది, సౌండ్ ఆఫ్ మ్యూజిక్ చాలా బాగుంది' అన్నది పద్మ.

'మాకు సినిమాలకి కలసి వెళ్లే అలవాటు లేదు' అన్నది రాధ. పద్మకి ఆమాటలు అసందర్భంగా అనిపించేయి.

ఆరాత్రి—

—రాధ తెగించి రంగనాయకులితో అన్నది.

'ఎంత స్నేహితుడు చెల్లెలని నన్ను మభ్యపెట్టినా మీ ప్రవర్తన నాకేం నచ్చలేదు. ఇంట్లో పెళ్ళాం అనే దయ్యం ఒకటి వచ్చిందన్న విషయం మీకు గుర్తుందా! ఎందుకీ దాగుడుమూతలు? నిజాన్ని తెలుసుకోలేనంత ఇడియట్‌ని కాదు నేను ఆడండి. మీ ఆట ఇంకెంత కాలం సాగుతుందో— అయినా పెళ్లయిన ఆడదానికి ఆమెకి వుండాలి సిగ్గు. మీరింతటి ఘనులన్న సంగతి నే నిప్పుడే తెలుసుకొన్నాను.'

'రాధా! ఏమిటి నువ్వు మాట్లాడేది. పద్మ వింటే ఏమనుకొంటుంది!' రాధని వారించ బోయాడు రంగనాయకులు.

'వింటే తనతప్పు తెలుసుకుంటుంది.'

'రాధా! నీ తెలివితక్కువ తనానికి సిగ్గుపడుతున్నాను.'

'హు! సిగ్గు మాటకేమొచ్చెగాని భయపడ్డం నేర్చుకోండి. అయినా నన్ను చంపి పారేస్తే మీకు అడ్డే వుండదుగా?'

'రాధా!' అరిచాడు.

'ఎందుకలా అరుస్తారు. నేను మాట్లాడిందాంట్లో తప్పేమన్నా వుంటే అనండి. ఆమెగారి ఫోటోని తమరు డైరీలో పెట్టి పూజిస్తున్న విషయంకూడా నాకూ తెలీక పోలేదు.'

రాధ వెంప ఛెళ్లుమన్నది.

'ఆపండి!!!'

రాధ వులిక్కిపడి గుమ్మంవేపు చూసింది. గుమ్మంలో పద్మ నించొని వుంది.

రంగనాయకులు విసురుగా అక్కడ్నుంచి మేడపైకి వెళ్లిపోయాడు.

షెల్ఫ్‌లోంచి రెడ్‌నైట్ విస్కీ సీసాని బయటకుతీసి మూతతీసి సీసానే నోట్లో

పెట్టుకుని గడగడ తాగేశాడు. సరిగా అదే సమయంలో పద్మ అక్కడకొచ్చి అతని చేతిలోని సీసాని లాక్కుని కిటికీ లోంచి బయటకు విసిరేసింది.

'రంగనాయకులు గారూ! ఇంతకాలం మీరు సాత్వికులనుకొన్నాను. అనుకొన్నానే గానీ ఇప్పుడు చూసింతర్వాత మీరెంతగా ఎదిగిపోయారో తెల్సుకొన్నాను. మీరేవన్నా అనుకోండి. నాకు త్రాగుబోతులంటే అసహ్యం. నాకీ విషయం ముందే తెలిస్తే ఈ గడప తొక్కేదాన్నే కాదు' పద్మ గొంతు బొంగురు పోయింది.


(పద్మా నవ్వులినే మనుష్యుల్ని నేను సహించను. నేను కలల్లో బతికిన మనిషిని. ఎన్నో రంగుల్ని చూశాను. ఆశపడ్డాను. అందులో ఏ రంగుని నా జీవితానికి పూసుకోవాలనుకొన్నాను. నీకు తెలీదు పద్మా నేనన్యాయం అయిపోయాను. నీకు తాగుబోతులంటే అసహ్యం కావచ్చును. కాని పద్మా! నేనెందుకు తాగుతున్నానో తెలుసా? ఐ పిటీయూ! నీకు తెలీదు. నేను క్యాన్సర్ రోగిని. రాస్కెల్ని నన్నింకేం అడక్కు. అడిగితే నిన్నిన్ను ప్రేమించి వెధవనై పోయానని చెప్పాల్సి వస్తుంది. అది నీకు చెప్పేసే ధైర్యంగల హార్టు నాలో లేదు. నేనంత గొప్పవాణ్ణి కాదు, నా లెసు. అది రూలు. ప్లీజ్ నువ్వు నా ముందునుంచి వెళ్లిపో. తాగినప్పుడు మనిషి తన మనస్సు అంతరంగిక విషయాలని బయట పెడతారంటారు. అందుకు భయమేస్తోంది.

నీకు తెలీదు. ప్రేమ తాలూకు గాయం కట్టుకున్నప్పుడే నేనిమందు వాడుతున్నాను. ఇది ఏ డాక్టరూ నాకు చెప్పలేదు. నేను లాయర్ని. మంచి చెడూ నాకు తెలుసు.)

రంగనాయకులు పేలవంగా నవ్వి అన్నాడు.

'ప్లీజ్. నన్నిం డిస్టర్బ్ చేయకు గో ఫ్రం హియర్. నేను మాట్లాడే స్థితిలో లేనిప్పుడు!' సోఫాలో కూలబడిపోతూ అన్నాడు.

పద్మ చరచర అక్కడ్నుంచి వెళ్లిపోయింది. వెళ్లిపోగానే ఆ గదాని లా మంచం పైన పడి ఏడ్చేశాడు రంగనాయకులు.



—మర్నాడు పద్మని దగ్ధం చేసొచ్చి ఇంటికొచ్చేసరికి రాధ సూట్‌కేస్‌తో ఎదురొచ్చింది.

'మీరు పెద్దలాయురే కావచ్చు. కానీ నాకూ చెప్పుకోదగ్గ వ్యక్తిత్వం వుంది. మా నాన్నగారూ లాయరే! మనిషి విలువ తెలీని వాళ్ళదగ్గర వుండడం నాకు చేత కాదు. ఇలవ్!' రంగనాయకులు ఆమె వెళ్ళినవేపు చూస్తూ వుండిపోయాడు.

*　　*　　*

—వర్షం జోరుగా కురుస్తోంది. ఉరుము భయంకరంగా వురిమింది.

పిడుగుపాటుకు అతని గుండె అవిసిపోయింది. గుండెని పట్టి ఎవరో పిండుతున్నట్టుగా అనిపించింది. మంచంపై నుండి లేవడానికి ప్రయత్నం చేశాడు.

'అమ్మా!' గుండెని చేత్తో పట్టుకొని లేచి నిలబడ్డాడు. ఎక్కువసేపు నించోలేక అలాగే నేలమీద కుప్పలా కూలిపోయాడు రంగనాయకులు.

*　　*　　*

'ఇదికల కాదుకదా!' అనుకొన్నాడతను.

రాధ కన్నీళ్ళతో తన మొహంలో మొహం పెట్టి ప్రేమగా చూస్తోంది.

# ఇది విషాదం

'రాధా!' అని పిలిచేడు.

'ఏమండీ! నన్నన్యాయం చేసేద్దామను కొన్నారా?' రాధ గొంతు జీరబోయింది.

'నిన్ను చూడగలనని కలలోకూడా అను కోలేదు. చివరి గడియల్లో అయినా చూడగలిగేను. అదృష్టవంతుణ్ణి.'

రాధ తనచేత్తో అతని నోటిని మూసింది.

కళ్ళొత్తుకున్నది రాధ.

'నువ్వెంతో మంచిదానివి నీ మనసు నాకు తెలుసు రాధ!'

'......', అతనివంక చూస్తూ వుండిపోయింది.

'రాధా! నీకీ సంగతి తెలుసా?',

'ఏమిటి?'

'పద్మ చచ్చిపోయింది రాధా! ధనుర్వాతం పద్మని పొట్టన పెట్టుకొంది రాధా! పద్మ లేదు రాధా! పద్మ లేదు. నా అనురాగవల్లరి పద్మలేదు. నేను ప్రేమించిన దేవత అవతారం చాలించింది' ఏడుస్తున్నాడు రంగనాయకులు.

రాధ కళ్ళుకూడా నీళ్ళ నిండుకున్నాయి.

'రాధా! పద్మని క్షమించమని అడుగు. పద్మ ఆత్మ శాంతిస్తుంది. నిన్ను తప్పకుండా క్షమిస్తుంది.'

రంగనాయకులి కళ్ళనుండి జారుతోన్న కన్నీటిని పైట చెంగుతో తుడిచింది రాధ, తనూ కళ్ళనీరు నిలపుకొంటూను.

'నువ్వేదునున్నావా రాధా! నా కిప్పుడు చాలా సంతోషంగా వుంది. నేనాశించినమార్పు నీలో వచ్చింది. దట్స్ వాట్ ఐ వాంట్ రాధా! ఇంతకాలమూ పొగ మంచులా నీలో పేరుకుపోయిన అనుమానాలని కన్నీళ్ళ రూపంలో కరిగించి వేస్తున్నావు. నీ మనసు స్వచ్ఛమైన మంచులాంటిదని నాకు తెలుసు. వెల్ నేనిప్పుడేమయిపోయినా ఫర్లేదు' అన్నాడు రంగనాయకులు.

రంగనాయకులు కళ్ళు మూసుకున్నాడు బాధగా. రాధ మెల్లగా వంగి అతని నుదుట ముద్దు పెట్టుకొంది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచేడు. రాధ చాలా భయంగా కనబడింది. ఆందోళనగా తనవంక చూస్తోంది. డాక్టరు ఇంజక్షన్ ఇస్తున్నాడు.

'ఏమండీ!' అన్నది కంగారుగా రాధ.

(రాధా నాకు భయంగా వుంది. నేను చచ్చిపోతున్నాను. నిన్నొదిలి వెళ్ళిపోతున్నాను రాధా! అదుగో పద్మ కనిపిస్తోంది రాధా! పద్మన్నా కనిపిస్తోంది రాధా! నన్ను రమ్మంటుంది రాధా రానన్నా రమ్మంటోంది రాధా! నా రాధ ఏడుస్తోంది. ప్లీజ్. రాలేను పద్మా రాలేను. నువ్వెళ్ళిపో! రాధా యముడొస్తున్నాడు. అయిపోయింది రాధా! నేను వెళ్ళిపోతున్నాను. నిన్నన్యాయంచేసి వెళ్ళిపోతున్నాను. నా పద్మ దగ్గరకి వెళ్ళిపోతున్నాను.)

'రాధా!' అనాలని ప్రయత్నం చేశాడు రంగనాయకులు. రాధ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు ప్రేమగా.

అతని కళ్ళకి ఏడుస్తోన్న రాధ, డాక్టరూ, నర్సు మసక మసగ్గా కనుపించసాగేరు. ●

